క్లుప్తంగా

సార్వత్రిక ఇంటర్‌లో అడ్మిషన్లు

పాకాల : ఇంటర్‌ను మధ్యలో మానేసేసిన విద్యార్థులు సార్వత్రిక ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బేబీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు సార్వత్రిక ఇంటర్ అడ్మిషన్లు ప్రవేశపెట్టిందన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ద్వారా ఎప్రిల్‌లో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇంటర్‌లో చేరదలచిన వారు తమ 10వ తరగతి మార్కుల జాబితా తీసుకుని ఈ నెల 27వ తేదీ లోపు ప్రిన్సిపాల్ సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు నియమాలు పాటించాలి

భాకరాపేట: రోడ్డు నియమాలను విధిగా పాటించాలని భాకరాపేట ఎస్‌ఐ ప్రకాష్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం భాకరాపేటలో వాహనదారులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. తద్వారా సురక్షితంగా గమ్యస్థానం చేరుకుంటారని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ మన బాధ్యత

భాకరాపేట: ప్రభుత్వ భూముల పరిరక్షణ మన బాధ్యత అని చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ హనుమాన్‌నాయక్ తెలిపారు. ఆయన బుధవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ వీఆర్వోలు తమ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ప్రవేశిసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

వ్యాన్ బోల్తా : 27 మందికి గాయాలు

రామచంద్రాపురం: వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి వద్ద వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడి రామచంద్రాపురం మండలం అనుప్పల్లికి చెందిన 27 మందికి గాయాలయ్యాయి. వారు బుధవారం వెదురుకుప్పం మండలం కమ్మకండ్రిగలో బంధువుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వ్యాన్‌లో బయలుదేరారు. మార్గమధ్యంలో బ్రాహ్మణపల్లి వద్ద వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 27 మందికి గాయాలయ్యాయి. వారిని 108లో తిరుపతి రుయాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న రూప్‌సుందర్‌ను చెన్నై తీసుకెళ్లారు.

నలుగురికి రిమాండ్

తిరుపతి లీగల్: విద్యుత్ తీగల బండల్స్‌ను చోరీ చేసిన కేసులో నలుగురికి మార్చి 7 వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధిశ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. తిరుపతి తిమ్మినాయుడుపాళ్యం కేఆర్ నగర్‌లో నిర్మిస్తున్న అన్నపూర్ణ నిలయం అపార్ట్‌మెంట్‌లో ఈనెల 11న రూ.2.40 లక్షల 70 విద్యుత్ వైర్ల బండల్స్ చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేసి మల్లంగుంట పోస్టల్ కాలనీకి చెందిన బి.వెంకటేష్, వెదురుకుప్పం మండలం సోమేంద్రపురానికి చెందిన నిమ్మనపల్లి ఈశ్వరయ్య, ఆర్‌సీ పురం మండలం బలిజపల్లి హరిజనవాడకు చెందిన ఆర్.గుణశేఖర్ అలియాస్ గుణ, తిమ్మినాయుడుపాళ్యం రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన పి.కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం

తిరుచానూరు(చంద్రగిరి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవాన్ని బుధవారం తిరుచానూరు జెడ్పీటీసీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం మురళి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెపన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం స్కౌట్స్ విద్యార్థులు తిరుచానూరులో ర్యాలీ నిర్వహించారు. స్కౌట్స్ మాస్టర్ వెంకటరత్నం, కుప్పిరెడ్డి, కోటేశ్వరరావు, పళణి సుదర్శన్, లీలా ప్రతాప్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం గోదాముల పరిశీలన

తిరుపతి అలిపిరి: తిరుపతి మంగళం సమీపంలో ఉన్న ఎర్రచందనం గోదాములను బుధవారం అటవీశాఖ టెక్నికల్ విభాగం పీసీసీఎఫ్ బీకే సింగ్ పరిశీలించారు. గ్లోబల్ టెండర్లు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రేడ్‌ల వారీగా సిద్ధం చేసిన ఎర్రచందనం లాట్లు, వాటి వివరాలను టెండర్ పోర్టల్లో నమోదు చేశారు. బిడ్డర్లు గోదాములను సందర్శించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

అడుగడుగునా నిర్లక్ష్యం

మైనారిటీ తీరని పిల్లలు ద్విచక్ర వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. కొంతమంది తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పిల్లలకు ద్విచక్ర వాహనాలను ఇస్తున్నారు. పిల్లలు ఇద్దరు, ముగ్గురితో కలిసి రద్దీగా ఉన్న రోడ్లలో వేగంగా వెళుతున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నా వారి తీరు మాత్రం మారలేదు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడడం కన్నా పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకపోవడం మంచిదని పలువురు సూచిస్తున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ద్విచక్ర వాహనంపై నలుగురు చిన్నారుల ప్రయాణం



వాహనంపై వెళుతున్న ముగ్గురు పిల్లలు

రేపు తిరుపతి పుట్టిన రోజు వేడుకలు



తిరుపతి పుట్టినరోజు వేడుకల ఫ్లెక్సీలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- ఫ్లెక్సీలు, స్టిక్కర్ల ఆవిష్కరణ

తిరుపతి మంగళం : ఆధ్యాత్మిక నగరం తిరుపతి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద తిరుపతి 893వ పుట్టిన రోజు వేడుకల ఫ్లెక్సీలు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. పోస్టర్లను ఆటోలకు అతికించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ఏ నగరానికీ దక్కని అదృష్టం తిరుపతికి దక్కిందన్నారు. నగర పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం తిరుపతి ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. మన ఇంటి వేడుకలుగా బావించి నగర ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు గోవిందరాజుస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవ వికాస వేదిక కన్వీనర్లు శైలకుమార్, సాకం నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరిసింహాచారి, శేఖర్‌రెడ్డి, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ తొండమనాటి వెంకటేష్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, వెంకటేష్‌రాయల్, వెంకటరెడ్డి, సురేంద్రరెడ్డి, గీతాయాదవ్, ఊతుకుంట మోహన్, కంకనాల రమేష్, నాదముని, చింతారమేష్, గల్లా కవిత పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుపతి కల్చరల్: మహిళా సంఘాల సభ్యులకు బుధవారం టాటా ట్రస్ట్ వైద్యులు ఓటేరులో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు చేశారు. ఓటేరు సర్పంచ్ లక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 150 మంది మహిళలకు ఉచితంగా బీపీ, షుగర్, హెపటైటిస్, రొమ్ము, గర్భాశయం, నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. రాస్ పాదువు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు, ఉప సర్పంచ్ మౌళి, రాస్ సిబ్బంది నాగేశ్వర్, మునిరాజ, పద్మావతి, లక్ష్మీ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: కమ్మపల్లి పీహెచ్‌సీలో తిరుపతి మెటర్నటీ ఆస్పత్రి వైద్యులు ఉచిత క్యాన్సర్ పరీక్షలు చేపట్టారు. 30 ఏళ్లు దాటిన మహిళలకు రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు చేశారు. మెటర్నటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, కమ్మపల్లి పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ మహేంద్రరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత, సునీత పాల్గొన్నారు.

దివ్యరథంపై ఆదిదంపతుల కటాక్షం



చంద్రగిరి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొండవాడ సమీపంలోని అగస్తీశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి, అమ్మవార్లు దివ్యరథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. ఉదయం 8 గంటలకు ఆది దంపతులు రథంపై ఆశీనులై ఆలయం చుట్టూ ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి దివ్యాలంకరణ భూషితులైన స్వామి, అమ్మవార్లు కామధేనువు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

అత్యాధునికంగా సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణం

తిరుపతి తుడా: సిటీ ఆపరేషన్ సెంటర్ భవనాన్ని అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కమిషనర్ అనుపమ అంజలితో కలిసి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనుల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అనుకున్న సమయానికి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఈ సెంటర్ ద్వారా తిరుపతి నగరంలో జరిగే ప్రతి అంశాన్నీ మానిటరింగ్ చేయవచ్చని తెలిపారు. మేయర్ శిరీష మాట్లాడుతూ భవన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేలా నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సెంటర్ తిరుపతి నగరానికే తలమానికంగా ఉంటుందన్నారు. కార్పొరేటర్ నరసింహాచారి, డీఈ దేవిక, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చార్టెర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ కమిటీ ఎంపిక



చార్టెర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ అధ్యక్షుడిని సత్కరిస్తున్న పూర్వ శాఖా అధ్యక్షుడు

తిరుపతి కల్చరల్: అఖిల భారత చార్టెర్డ్ అకౌంటెట్స్ తిరుపతి శాఖ 2023–24 నూతన కార్యవర్గాన్ని బుధవారం బాలాజీ కాలనీలోని చార్టెర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ కార్యాలయంలో ఎంపిక చేశారు. తిరుపతి శాఖ అధ్యక్షుడిగా సీ.జగదీష్‌కృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి.రవీంద్రారెడ్డి, కార్యదర్శిగా బీవీ.మధుసూదన్‌బాబు, కోశాధికారిగా ఎం.సింహాద్రి నాయుడు, చైర్మన్‌గా బాలాజీ కామిశెట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అఖిల భారత చార్టెర్డ్ అకౌంటెంట్స్ పూర్వ అధ్యక్షులు ఎం.దేవరాజరెడ్డి, సి.నరసింహులు నూతన అధ్యక్షుడు జగదీష్‌కృష్ణను అభినందించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



రామచంద్రాపురం : సొరకాయలపాలెంలో పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు



పాకాలలో..



పెరుమాళ్లపల్లిలో..

రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురానికి చెందిన మీనాకు, సొరకాయలపాలెంకు చెందిన వెంకటపురంధర్‌కు, అలాగే సీకాలేపల్లికి చెందిన దివ్యభారతికి వివాహం నిశ్చయమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కవిత భాస్కర్ యాదవ్, ఎంపీటీసీ రాజేష్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ముక్కోటి, పంచాయతీ కన్వీనర్ కేశవులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవి రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి అందజేశారు.


పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ కొత్తపచ్చిపాలపల్లిలో పెళ్లి చేసుకోబోతున్న వధూవరులు స్వాతి, భూషన్‌కుమార్‌కు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. ఎంపీటీసీ గౌతమి, స్టేట్ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, నాయకులు గణపతిరెడ్డి, వినాయక, చంద్రశేఖర్‌నాయుడు, రవినాయుడు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: పెరుమాళ్లపల్లిలో గురువారం పెళ్లి చేసుకోనున్న నాలుగు నూతన జంటలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపించిన పెళ్లి కానుకను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వరరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్‌కు అంతరాయం

తిరుపతి రూరల్ : రేణిగుంటలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా తిరుపతి నగరంలో గురువారం నుంచి 25 వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేణిగుంట సబ్ స్టేషన్ నుంచి తిరుపతికి వచ్చే ముఖ్యమైన ఫీడర్లు కావడంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలుమార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం వుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు



వినాయక పూజ చేస్తున్న విద్యార్థులు, పాఠశాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: యశోదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాల పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక పూజ చేశారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ రాజగోపాల్ బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత్రి ఎం.రమాదేవి, ప్రిన్సిపాల్ సారశ్మిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లా నేస్తం నిధులు విడుదలపై హర్షం

తిరుపతి లీగల్ : వైఎస్సార్ లా నేస్తం కింద బుధవారం నిధులు విడుదల చేయడంపై న్యాయవాది, వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాజారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ఖాతాల్లోకి నిధులు జమ చేయడంతో జూనియర్ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,248 మంది యువ న్యాయవాదులకు రూ.1.55 కోట్ల నిధులు జమ చేయడం అభినందనీయమన్నారు.

'నిజాలను నిర్భయంగా ప్రచురించండి'



సన్మానం పొందిన జర్నలిస్టులతో మంత్రి రోజా

- పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా
- ప్రెస్ క్లబ్ నూతన డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే భూమన



విరాళం ఇస్తున్న ముద్రనారాయణ

తిరుపతి తుడా : నిజాలను నిర్భయంగా ప్రచురించాలని మంత్రి పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ 29వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బాలచంద్ర ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. ఇందులో ముఖ్య అతిథులుగా మంత్రి రోజా, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పాల్గొన్నారు. మంత్రి రోజా మాట్లాడుతూ పత్రిక ల్లో ప్రచురించే వార్తల్లో నిజాయితీ, నిబద్ధత, విలువలతో కూడిన అంశాలు ఉండాలని సూచించారు. కత్తి కన్నా కలానికి పదునెక్కువని.. వేగం కూడా ఎక్కువేనని పేర్కొన్నారు. పత్రికా విలేకరులు అనుకుంటే ఒక వ్యక్తిని హీరోని చేస్తారని, నువ్వెంత అంటే అదే వ్యక్తిని జీరో కూడా చేస్తారని తెలిపారు. మన రాష్ట్రంలో రెండు రకాల విలేకరులతో జర్నలిజం నడుస్తోంద న్నారు. ప్రజల పక్షంగా వార్తలు రాసే వారికి సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. యాజమాన్యం విధివిధానాలు, కట్టుబాట్లను పాటిస్తూ వార్తలు రాస్తే నిజా యితీ దెబ్బతిని విలేకరికి గౌరవం దక్కదన్నారు. కొత్తగా చేరిన జర్నలిస్టులు పాతతరం, సీనియర్ జర్నలిస్టుల విలువలు, నిజాయితీని ఆదర్శంగా తీసుకుని వార్తలు రాయాలని పిలుపునిచ్చారు.

విలువలతో కూడిన జర్నలిజం అవసరం

పాత తరంలోని సీనియర్ జర్నలిస్టులు విలువలతో కూడిన అభ్యుదయ భావజాలంతో పత్రికా రంగంలో వ్యాసాలు రాసేవారని, ప్రస్తుతం అలాంటి వ్యాసాలు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో అభ్యుదయ భావాలు కలిగిన నాయకుల సమాచారాన్ని సేకరించి వార్తలుగా ప్రచురించే వారిని తెలిపారు. ప్రస్తుతం జర్నలిజంలో విలువలు తగ్గాయని వాపోయారు. కచ్చితమైన సమాచారాన్ని అందించడంలో కొంత గ్యాప్ ఏర్పడిందన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహాయం అందిస్తానని వెల్లడించారు. కోవిడ్ సమయంలో కొంతమంది మీడియా మిత్రులను కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్వీయూ వీసీ కే.రాజారెడ్డి మాట్లాడుతూ మీడియా మిత్రులు నిజాయితీగా, నిబద్ధతగా వార్తలు రాస్తూ సమాజాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర వహిస్తారని పేర్కొన్నారు.

రూ.50 వేల విరాళం

డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రెస్ క్లబ్ సంక్షేమ నిధికి రూ.50 వేల విరాళం అందజేశారు. నగదును ఎమ్మెల్యే భూమన చేతుల మీదుగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులకు ఇచ్చారు.

సకాలంలో పన్నులు వసూలు చేయాలి



పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, సేవా పన్నులను సకాలంలో వసూలు చేయాలని కమిషనర్ అనుపమ అంజలి ఆదేశించారు. ఆమె బుధవారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ నగరంలో పన్ను బకాయిదారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. అప్పటికీ వారు స్పందించకపోతే సహాయ నిరాకరణ చేయాలన్నారు. తర్వాత మున్సిపల్ యాక్ట్ ప్రకారం తుది చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఆయా వార్డుల్లో పర్యటించి మార్చి చివరి నాటికి 95 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. అధిక మొత్తంలో నీటి చార్జీలు బకాయిలు ఉన్నవారి కనెక్షన్లు తొలగించాలని ఎస్ఈ మోహన్‌కు సూచించారు. ఇకపై ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి పన్నులు వసూలు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుపతి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని ప్రజలను కోరారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, ప్రకాష్, సూరిబాబు, మధుసూదన్ రెడ్డి, నవీన్ కుమార్, శంకరయ్య, జ్యోతిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రెవెన్యూ సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

వివరాలు ఆన్‌లైన్ చేయాలని వినతి



సబ్ ట్రెజరర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులకు సాధారణ, ఓవర్ టైమ్ అలవెన్స్‌లు, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ తదితర ప్రయోజనాల వివరాలను ఆన్‌లైన్ చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నట్టు వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు తెలిపారు. వారు బుధవారం తిరుపతి ట్రెజర్ కార్యాలయంలో సబ్ ట్రెజరర్ మల్లికార్జున్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు తదితర ప్రాంతాల్లోని ఆర్టీసీ ఉద్యోగుల అలవెన్స్‌ల వివరాలను ట్రెజరీ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో వారికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. తిరుమల, తిరుపతి, మంగళం, అలిపిరి డిపోల ఉద్యోగుల వివరాలు నమోదు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. స్పందించిన సబ్ ట్రెజరర్ మల్లికార్జున్ ప్రసాద్ మాట్లాడుతూ పరిశీలించి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు అర్జున్, పరంధామయ్య, ఎంటీఆర్ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 2 నుంచి పిఠాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి అలిపిరి: కాకినాడ జిల్లా పిఠాపురంలో పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 2 నుంచి 8 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. మార్చి 2వ తేదీ సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, 3న ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొంది. 4న గరుడ వాహనం, 5, 6 తేదీల్లో ఊంజల్‌సేవ ఉంటాయని తెలిపింది. 7న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించింది. 8న సాయంత్రం పుష్పయాగం నిర్వహిమని పేర్కొంది.

పట్టాభిపై సుమోటోగా కేసు నమోదు చేయాలి

తిరుపతి లీగల్ : పోలీసులు కొట్టారంటూ తప్పుడు సమాచారం ఇచ్చి కోర్టును తప్పుదారి పట్టించిన టీడీపీ నాయకుడు పట్టాభి, తప్పుడు వార్తను ప్రచురించిన మీడియాపై సుమోటోగా కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు కోరారు. వారు మాట్లాడుతూ ప్రాణాలకు కూడా తెగించి ప్రజల కోసం పనిచేసే పోలీసులను కించపరుస్తూ మాట్లాడుతున్న టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు దొరబాబు, మోహన్‌కుమార్‌రెడ్డి, రాజేష్, ఎస్‌జి వెంకటరామయ్య, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయమూర్తికి అదనపు బాధ్యతలు



జడ్జి పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

తిరుపతి లీగల్ : తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న సీహెచ్ పవన్‌కుమార్‌ను విశాఖపట్నం సమీపంలోని భీమునిపట్నం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా రాష్ట్ర హైకోర్టు బదిలీ చేసింది. ఈ క్రమంలో ఆయనను తిరుపతి న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దినకర్, న్యాయవాదులు రాజగోపాల్, ఆదినారాయణ, యోగానంద్, సురేష్‌రాజు మాట్లాడుతూ జడ్జి పవన్ కుమార్ సేవలను కొనియాడారు. తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు, ఐదవ అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాష, సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీనివాసరావు, శిరీష్, జూనియర్ సివిల్ జడ్జిలు కోటేశ్వరరావు, శ్రీనివాస్, సరిత, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి హరినాథనాయుడు పాల్గొన్నారు.